# 2

# బైబిలు దేవుని వాక్యము

బైబిలు దేవునిచే ప్రేరేపింపబడినట్టు చెప్పుకొంటుంది (2 తిమోతి 3:16, 17). వాస్తవంగా, "దేవునిచే ప్రేరేపింపబడిన" అని తర్జుమా చేయబడిన గ్రీకు ప్రయోగానికి "దేవుడు ఊదెను" అనేది అక్షరార్థం. మత సంబంధంకాని గొప్ప రచయితలు అనేకులున్నారు. అయితే వారు ప్రోత్సాహకరమైన అనేక సూత్రాలు లేక సంఘటనలు అనే వాటిచేత "ప్రేరేపింపబడి" గొప్ప సంగతులు తెలిపారు. కాని బైబిలైతే తన ప్రేరేపణకు దేవుడు మాత్రమే మూలమని చెప్పుకుంది. ఈ పక్షంగా, అపొస్తలుడును పలు క్రొత్త నిబంధన రచనలకు లేఖకుడైన పేతురు యిలా అన్నాడు: "ఏలయనగా ప్రవచనము ఎప్పుడును మనుష్యుని ఇచ్ఛనుబట్టి కలుగలేదు గాని మనుష్యులు పరిశుద్ధాత్మవలన ప్రేరేపింపబడినవారై దేవుని మూలముగ పలికిరి" (2 పేతురు 1:21).

దైవ ప్రేరేపితమైన ఈ గ్రంథానికి నిన్ను పరిచయం చేయడమే ఈ పాఠం యొక్క ఉద్దేశమయ్యింది. బైబిలును గూర్చిన దైవికమైన రుజువులు యిందులో చేర్చబడ్డాయి. అయితే ఈ అధ్యాయము యొక్క ప్రాథమిక ఉద్దేశము ఆశ్చర్యకరమైన ఈ గ్రంథమందు నీకు అభిలాషను పుట్టించి, నీయంతట నీవే దానిని చదివేలా నిన్ను ప్రోత్సహించడమై యుంది. అందువలన నీవు బైబిలును చదువుతూ, దాని కట్టడలననుసరించుతూ (యాకోబు 1:21-25), విశిష్టమైన ఈ గ్రంథం ఆయా తరములలోని జనులపై ఎందుకు అంతటి ప్రభావాన్ని కలిగియుందో నీవు కూడా గ్రహించగలవు.

దేవుని వాక్యాన్ని గూర్చి మాట్లాడుతూ, "అద్భుతమైన వాక్యం యొక్క ఏడు అద్భుతాలు" అని ఒక రచయిత అన్నాడు. ఆ ఏడు అద్భుతాలకు ఈ అధ్యాయంలో ప్రాముఖ్యత యివ్వబడింది. అవి ఏవంటే - దేవుని వాక్యము యొక్క ప్రాచీనత్వపు, నవీనత్వపు, విభిన్నత్వపు, ఏకత్వపు, చర్చనీయాంశపు, ప్రాబల్యపు, సౌఖ్యపు అద్భుతాలు. ఇంతేకాదు, తప్పులులేని చారిత్రక, భౌగోళిక వింతలు, మరికొన్ని యితర వింతలుకూడా యిందు ప్రస్తావించవచ్చు. కాని, "నీ శాసనములు ఆశ్చర్యములు" అని పలికిన కీర్తనల

రచయితతో కలిసి మనం ఆశ్చర్యపడడానికి (కీర్తన. 119:129ఎ) ఈ ఏడు అద్భుతాల చర్చయే సరిపోతుంది.

## దాని ప్రాచీనత్వము

లోకంలో అనేక ప్రాచీన గ్రంథాలున్నాయి, వాటిలో బైబిలు ఒకటి! గ్రంథాలకు పాతబడే అవకాశం ఎక్కువగా ఉంటుంది, ఎందుకంటే అవి చాలా సున్నితమైనవి. అగ్ని వాటిని కాల్చివేస్తుంది, నీరు వాటిని పాడుచేయగలుగుతుంది, కీటకాలు వాటిని తినివేస్తాయి, జాగ్రత్తలేని వ్రేళ్లు వాటిని చింపుతాయి కూడా.

బైబిలైతే, తన సంపూర్ణ స్వరూపంలో రమారమి రెండువేల ఏండ్లుగా ఉంది. దానిలో కొన్ని భాగాలు పూర్ణంగా రెండంతలు పాతవైయుంటాయి. దీనితో లోకంలో ఉన్న మరి ఏ యితర గ్రంథాన్ని పోల్చ వీలుపడదు! బైబిలు యొక్క వయస్సే సమస్తాన్ని తట్టుకొని నిలిచియుండగల తన శక్తిని, లయముకాని దాని స్వభావాన్ని సూచిస్తుంది.

ఆదికాండము, నిర్గమకాండము, లేవీయకాండము, సంఖ్యాకాండము, ద్వితీయోపదేశకాండము అని పిలువబడే అతి ప్రాచీనమైన రచనలు పాత నిబంధనలో ఉన్నాయి. అవి మోషేచే లిఖించబడ్డాయి. వాటిలో నరుల ఆరంభము, రికార్డు చేయబడిన కాల ప్రారంభ దినాలు దాఖలు చేయబడ్డాయి. నేటి మానవుని యొక్క స్వాధీనంలో ఉన్న అతి ప్రాచీనమైన ప్రతులనుండి ఈ రచనలు సంపూర్ణంగా మనకు వచ్చాయని సురక్షితంగా చెప్పవచ్చు!

దాన్ని నాశనం చేయాలని నరుడు తన ప్రయత్నాలను తరచుగా సాగించినా, బైబిలు మాత్రం ఈ ప్రాచీనమైన తన నిజ వయస్సుకే వచ్చి చేరుకుంది. భూలోకమెరిగిన అత్యంత బలమైన ప్రభుత్వాలు ఈ పుస్తకాన్ని లేకుండ చేయాలని మాటి మాటికి ప్రయత్నించాయి. కొన్ని సమయాల్లోనైతే, దానిని చదివినందుకే మనుష్యులు ఉరికొయ్య మీద చచ్చారు. దాన్ని తమ స్వాధీనంలో ఉంచుకొన్నందుకే లేక దాన్ని కలిగియున్నందుకే కొందరు సజీవంగా దహించబడ్డారు. దాని పేజీలను తిప్పుతుంటేనే వర్ణించడానికి వీలుకాని హింసలకు జనులు గురియైయ్యారు. అయినా, ఏ కాలమందు వ్రాయబడిన ఏ గ్రంథముయొక్క ప్రతులకంటెను ఎక్కువైన బైబిలు ప్రతులు నేడు భూమిమీద ఉన్నాయి!

మూడవ శతాబ్దంలో, బైబిలు ప్రతి ఎవనియొద్ద ఉన్నా సరే, వానికి మరణదండన విధింపబడుతుందని రోమా చక్రవర్తియైన డయోక్లేషియన్ శాసించాడు. దీని విషయంలో అవిధేయులైనవారిని గూర్చి రిపోర్టు చేయని అధికారులను సహితం అతడు శిక్షించాడట.

తన చెడుతనాన్ని, నియంతృత్వాన్ని ఖండించిన బైబిలును లేకుండా చేయాలనే మహా శక్తిమంతుడైన ఆ రోమా చక్రవర్తి పూనుకున్నాడు. “భూతలంనుండి క్రైస్తవ రచనలు లేకుండా సంపూర్ణంగా నిర్మూలించానని” రెండు సంవత్సరాల తరువాత అతడు ప్రగల్భాలు పలికాడు.

రమారమి ఒక శతాబ్దం తరువాత క్రైస్తవ్యాన్ని అవలంభించిన కాన్‌స్టాంటైన్ అనే మరో చక్రవర్తి, తన సామ్రాజ్యంలో ఉన్న సంఘాలన్నిటిలో క్రొత్త నిబంధన ప్రతులు ఉండాలని కోరాడు. దేవుని వాక్యపు ప్రతులను కనుగొని వాటిని తన ఆఫీసర్లకు యిచ్చిన ప్రతివానికి తగిన బహుమానం అతడు యివ్వజూపాడు. గతంలో డయోక్లెషియన్ వాటిని నిర్మూలం చేసినట్టు భావించినా, ఇరవైనాలుగు గంటలలోనే లేఖనాల ఏభై ప్రతులు (కాన్‌స్టాంటైన్) చక్రవర్తికి యివ్వబడ్డాయి!

సులభంగా చెరిగిపోయే సిరాతో, నశించిపోయే పదార్థాలమీద, లేఖనాలు లిఖింపబడినా, కొల్లగొట్టే కాలాన్ని, ప్రకృతి శక్తుల ప్రభావాన్ని, నాశనకరమైన మానవ కుతంత్రాలను ఎదిరించి, నేటి మన శతాబ్దంవరకు బైబిలు సజీవంగానే నిలిచిపోయింది. ఇంతటి దీర్ఘమైన, నమ్మశక్యముకాని దాని చరిత్రకు దేవుని కరుణాహస్తపు కాపుదల మాత్రమే లెక్క చెప్పగలదు.

## దాని నవీనత్వము

అది ఎంత ప్రాచీనమైనదో, అనేక విషయాలలో బైబిలు అంతే నవీనమైనది. తమ ఉపదేశమందు పాత పుస్తకాలే తాజాతనంగా ఉంటాయని మనం ఎదురుచూడం గదా! పది సంవత్సరాల క్రిందటి సైన్సు పుస్తకమైతే వాడుకలో లేనిదౌతుంది. ఒక వంద సంవత్సరాల క్రిందటిదైతే, అప్పుడు ఏమి జరిగిందో తెలిసికోవాలనే కుతూహలంగా ఉంటుంది. 1700ల్లో ప్రింటయిన సాల్మన్ యొక్క గర్భశాస్త్రంలో సూచింపబడిన వైద్య సమాచారమైతే, పిచ్చిపట్టినవానిలా నవీన వైద్యుని నవ్వజేస్తుంది. 1600ల్లోని ఫార్మకోపుయా లండన్ సిస్ అనేది అంతకంటే హాస్యాస్పదంగా ఉంటుంది. ఎలాగంటా వేమో, ఆనాడు ప్రఖ్యాతిగాంచిన ఆ పుస్తకం ప్రకారం ఒక వైద్యుడు యిప్పటికి యింకా మందులిస్తున్నట్టయితే, వైద్య చికిత్సను క్రమబద్ధం చేసే అధికారులు అట్టి వైద్యుని జైల్లో పెడతారు!

కొద్ది సంవత్సరాల వ్యత్యాసమైనా వ్యత్యాసమేనని చెప్పడానికి, 150 సంవత్సరాల క్రిందటనున్న వృక్ష శాస్త్రపు పాఠ్య పుస్తకంనుండి ఒక ప్రతిపాదన యిక్కడ ఉదహరించ

బడుతుంది:

> ఇటలీలో ఒక మొక్క పెరుగుతోంది...అరుదైన సువాసనగల తెల్లటి పువ్వులను అది పుష్పిస్తుంది. అయినా వితల్‌కు ఈ వింతైన లక్షణముంది: చెమ్మగల రాళ్లక్రింద ఆ పుష్పాలను పెట్టి అక్కడే వాటిని ఉండనిచ్చినట్టయితే, పది దినాల్లో విషపు తేళ్లగా తమ్మును తామే మార్చుకుంటాయి; అవి కుట్టాయంటే మాత్రం చావే.

"న్యాయంగా ఉండు. గత నూటయభై సంవత్సరాలలో చాలా నేర్చుకున్నాంలెండి. పాత పుస్తకాలను నేటి స్థాయికి పెంచలేము" అని నీవనవచ్చు. అసలు యింతకు పాయింటు అదే! కాని, ఉదాహరణకు, మోషే, 3500 సంవత్సరాల క్రిందట వ్రాశాడు, అయినా అతని రచనలు నవీన విజ్ఞాన శాస్త్రాన్నిగానీ జ్ఞానాన్నిగానీ వ్యతిరేకించినట్లు నీవు కనుగొనలేవు. బైబిలు యొక్క పేజీల్లోని నవీన ఖగోళశాస్త్రము, విశ్వ శాస్త్రము, మరియు యితర విజ్ఞాన శాస్త్ర పరిధులను గూర్చి నొక్కి చెప్పుతూ "బైబిలు యొక్క విజ్ఞాన శాస్త్రపు జ్ఞానం"పై సంపూర్ణంగా పుస్తకాలే వ్రాయబడ్డాయి. వాటిలో ఈలాటి వాస్తవాలు కూడా చేర్చబడ్డాయి:

> భూమి గుండ్రముగా ఉన్నది (యెషయా 40:22; సామె. 8:27).
> భూమి శూన్యములో వ్రేలాడదీయబడియుంది (యోబు 26:7).
> ఆకాశము కొలతవేయ శక్యము కానంత విశాలమైనది లేదా నక్షత్రములు లెక్కింప నశక్యములు (ఆది. 15:5; యిర్మీయా 33:22).
> సముద్రములో ప్రకృతి సిద్ధమైన మార్గాలున్నాయి (నౌక యాననమందు అవి నేటికిని ఉపయోగపడుతున్నాయి) (కీర్తన. 8:8).

బైబిలు విజ్ఞాన శాస్త్ర గ్రంథమని అందలి పుస్తకాలు చెప్పుకొనవు. కాని, బైబిలు లేఖకులు విజ్ఞాన శాస్త్ర సంబంధమైన చర్చనీయాంశాలను తాకినప్పుడు, వారి కాలమందలి యితర లేఖకులవలె గాక, విజ్ఞాన శాస్త్ర వాస్తవాలకు వ్యతిరేకంగా వారు పలుకలేదు.

కాలానికి అతీతమైయున్న బైబిలు యొక్క విశేష గుణానికి ఆకర్షణీయమైన ఉదాహరణలు ఔషదపు పరిధిలో ఉన్నాయి. ఆనాటి ప్రపంచంలో నవీన ఆరోగ్యపు అలవాట్లు మోషే ధర్మశాస్త్రంలో సూచింపబడ్డాయి. శుచిగా ఉండడాన్ని, పరిశుభ్రతను, కడగానుండడాన్ని, వ్యాధి నిరోధక పద్ధతులు, వగైరాలను గూర్చి పాత నిబంధన యొక్క ఉపదేశం నింపివేయబడింది.

ఉదాహరణకు, శస్త్ర చికిత్స చేసేటప్పుడు, సర్జన్ తన ముఖానికి గుడ్డ కట్టుకునే ప్రమాణమైన పద్ధతి ఒకటుంది. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నవాని యొద్దకు వెళ్లేటప్పుడు అతడు ముఖానికి గుడ్డ కట్టుకుంటాడెందుకు? ఎందుకంటే, వ్యాధిగ్రస్థునికి తన వద్దనున్న క్రిములవలన ఆపద కలుగకుండాలని సర్జన్ ఈ పని చేస్తాడు. క్రిముల వ్యాపకాన్ని నిరోధించడం ఆ కట్టుకునే గుడ్డయొక్క ప్రాథమిక ఉద్దేశమైయుంది. ఇలా వ్యాపించే క్రిములున్నాయని కనుగొనడానికి శాస్త్రవేత్తలకు ఎంతకాలం పట్టింది. అయితే ఈలాటి క్రిములను ఉద్దేశించి 3500 సంవత్సరాలకు ముందే, ఈ ఆజ్ఞలను దేవుడు మోషేచే యిప్పించాడు: "ఆ పొడగల కుష్ఠరోగి ...; వాడు తన పైపెదవిని కప్పుకొని – అపవిత్రుడను, అపవిత్రుడను అని బిగ్గరగా పలుకవలెను" (లేవీ. 13:45; KJV).

వైద్యానికి సంబంధించిన మరొక పురోభివృద్ధి కార్యక్రమం రక్తాన్ని ఎక్కించడం. "రక్తం కార్చడం" లేక రక్తం కారిపోయేలా చేయడం చికిత్స జరిగించడమని అనేక సంవత్సరాలకు ముందు భావింపబడేది. వైద్యం అనే పేరుతో, అక్షరార్థంగా మరణించేవరకు కొందరి రక్తం కార్చబడింది. నేడైతే రక్తం కార్చడం కాదు, రక్తం ఎక్కించడం చికిత్సలో భాగంగా మారిపోయింది. కారణమేమంటే, రక్తమనేది శరీరము యొక్క జీవప్రవాహంగా గ్రహించబడింది. ఆది. 9:4లో చెప్పబడిన మోషే ప్రతిపాదన నవ యుగంలో సత్యంగా స్థాపింపబడింది. అతడిట్లన్నాడు: "మాంసమును దాని రక్తముతో తినకూడదు; రక్తమే దాని ప్రాణము." మరో మాటల్లో మోషే ఏమన్నాడంటే, మాంసమునకు ప్రాణము రక్తమే (లేవీ. 17:11–14 కూడా చూడు).

బైబిలు తప్పులేని వైద్య శాస్త్ర సంబంధమైన విషయాలు గలదని సూచించడానికి అనేక పుస్తకాలు అంకితం చేయబడుతున్నాయి. చాలా విధాలైన వైద్య అభ్యాసాలను అవి కవర్ చేస్తాయి. అయితే యిక్కడ కొన్ని ఉదాహరణలను చూద్దాం:

> స్త్రీలలోను పురుషులలోను ప్రాణి యొక్క "బీజాలు" ఉన్నాయి (ఆది. 3:15; 22:18).
> రోగముగల మనుష్యులనేమి, జంతువులనేమి తాకినప్పుడు – నీ దేహాన్ని, నీ వస్త్రాలను శుభ్రపరచుకొనడం అవసరం లేదా జ్ఞాన యుక్తం (సంఖ్యా. 19:5–22).
> చచ్చిన జంతువును తినడం సహజంగానే అపాయకరం (లేవీ. 17:15).

మనయొద్ద ఉన్న అతి ప్రాచీనమైన బైబిలు ఇరవైయొకటవ శతాబ్దపు వైద్య భావాలతో ఏకీభవించియుంది. ఇది బహు ఆశ్చర్యంగా ఉండలేదా?

బైబిలు యొక్క నవీనత్వం దానిలో చర్చించబడిన వివిధములైన అంశాలతో

ఉదహరింపవచ్చు. పైగా, ఈ గ్రంథమందలి నైతిక ప్రమాణాలను అధిగమించి ఎదిగినది లోకమందున్నట్టు ఎవరైనా చెప్పగలరా? దాని కట్టడలను వెనుకకు నెట్టివేయగల అధికమైన తెలివిని లేక జ్ఞానాన్ని మనమెక్కడైనా, కనుగొన్నామా? లేదు సుమీ! నవీన మానవుడు బైబిలు జ్ఞానాన్ని దాటి వెళ్లలేదు. లోకం వెయ్యి సంవత్సరాలు కొనసాగినా, యిరవై యొకటవ శతాబ్దానికి అది ఎలా తాజాతనంగా ఉందో, ముప్పై యొకటవ శతాబ్దానికి కూడా అది అంతే తాజాతనంగా ఉంటుంది!

## దాని భిన్నత్వము

బైబిలంతా కేవలం ఒకే ఒక పుస్తకమై, ఒకే అంశాన్ని గూర్చి చర్చించేదైయున్నా, మనం యిప్పటివరకు చర్చించిందంతా, చాలినంత వింతగానే ఉంటుంది. అయినా అసలు విషయం అది కాదే.

లోకంలోని అత్యంత విభిన్న గ్రంథాలలో బైబిలు ఒకటి. అయితే అది ఒకే గ్రంథ రచన కాదు. మొదట, అది పాత, క్రొత్త నిబంధనల కలయికయైయున్న రెండు గ్రంథములై యున్నది. ఆ రెండు నిబంధనలు ఒకదానినుండి మరియొకటి నాలుగు లేక అయిదు శతాబ్దాల వ్యవధితో వేరు చేయబడ్డాయి. రెండవది, ఈ రెండు గ్రంథాలు యింకా అనేకమైన పుస్తకాలుగా విభజింపబడ్డాయి; వాటిలో ముప్పైతొమ్మిది పాత నిబంధనలోను, ఇరవైయేడు క్రొత్త నిబంధనలోను ఉన్నాయి. అలా అవన్నీ చేరి అరవైయ్యారు పుస్తకాలు. మూడవది, ఈ అరవైయ్యారు పుస్తకాలు రమారమి నలభైమంది లేఖకులచే వ్రాయబడ్డాయి. ఈ నలభైకి పైగానున్న ఈ లేఖకులు దాదాపు రెండువేల సంవత్సరాల వ్యవధిలో జీవించారు! చివరిగా, ఈ లేఖకులు సాహిత్యమెరిగిన ప్రతి అంశం మీదను, అంతకు మించిన ఒకటి వ్రాశారు. ఆ "మించిన ఒకటి" మరి ఏ యితర పుస్తకంలో ఉండదు. ఆ అంశం: "నిజమైన ప్రవచనం" అనేది. బైబిలులోని వందలకొలది ప్రవచనపు ప్రతిపాదనలు పరిపూర్ణంగాను, ఖచ్చితంగాను నెరవేర్చబడ్డాయి. కొన్ని ఉదాహరణలను మాత్రమే మనం యిక్కడ చూద్దాం:

**దేశములను గూర్చిన ప్రవచనాలు:** దేశముల ఔన్నత్యము, క్షీణత, పతనాలు అనేవాటిని గూర్చి అనేకమైన ప్రవచనాలు యివ్వబడ్డాయి. ఉదాహరణకు, ద్వితీయో. 28:47-68లో వివరంగా ఇశ్రాయేలీయుల చరిత్ర చిత్రీకరింపబడింది. అష్షూరు (యెషయా 10:12, 24, 25; 2 రాజులు 17:24; 18:13లను చూడు) బబులోనుతో కలిపి (యెషయా 13; దానియేలు 5:28లను చూడు) యింకా

అనేకమైన యితర దేశాలను గూర్చిన ప్రవచనాలు యివ్వబడ్డాయి.

**జనులను గూర్చిన ప్రవచనాలు:** తాను జన్మించడానికి మూడువందల సంవత్సరాలకు ముందే రాజైన యోషీయా యొక్క పని, పారసీకదేశపు (1 రాజులు 13:2; 2 రాజులు 23:15, 16) రాజైన కోరెషు యొక్క ఏలుబడివలె (యెషయా 44:28; 45:1) ప్రవచింపబడింది. సెన్హరీబు యెరూషలేమును పట్టుకొనలేకపోయినా ఆశ్చర్యమైన సంఘటన కూడా ప్రస్తావనకు యోగ్యమైయుంది (2 రాజులు 19:32-35 చూడు).

**క్రీస్తు ప్రభువును గూర్చిన ప్రవచనాలు:** పాత నిబంధనలో ఉన్న రమారమి ఎనిమిది వందల ప్రవచనాలలో, మూడువందలకు మించినవి యేసు క్రీస్తు అను వ్యక్తియందు కేంద్రీకరించబడ్డాయి. వీటిలో అనేకమైన ప్రవచనాలు వాటి నెరవేర్పులు ఈ పుస్తకంలోని నాల్గవ అధ్యాయంలో పేర్కొనబడ్డాయి.

బైబిలు యొక్క భిన్నత్వం అది దేవుని యొద్దనుండి వచ్చిందని రుజువు చేస్తుంది. ఈ భిన్నత్వంలో ఏకత్వాన్ని మనం కనుగొంటాం గనుక యిది అసాధారణమైన సత్యమైయుండాలి. గ్రంథ రాజమైయున్న దీనిలో మానవ జీవితంలోని ఏ భాగమైనా, ఆత్మ సంబంధమైన ఏ విషయమైనా అలక్ష్యం చేయబడలేదు. మానవ ఉనికిలోని భాగాలన్నిటిని, దైవికమైన నడిపింపును అది తాకుతోంది.

## దాని ఏకత్వము

బైబిలు ఒకే ఒక రచయితచే వ్రాయబడిన ఏక గ్రంథమైయున్నట్టయితే, దాని భాగాలన్నీ సహజంగానే పొందిక కలిగియుంటాయని మనం ఎదురుచూస్తాం. అది ఒక గ్రంథమైయుండి నలభైకంటె ఎక్కువ మంది ఒకే అంశంపై వ్రాయడమనేది జరిగితే, వారందరి మధ్య పరిపూర్ణమైన ఏకీభావం ఉండడం చాల తక్కువై యుంటుంది. గనుక, నలభైకంటె ఎక్కువ మంది అరవైయ్యారు పుస్తకాలను ఆయా అంశాలపై వ్రాసినా, వారి మాటలన్నీ పరిపూర్ణమైన ఏకీభావం కలిగియున్నాయనే వాస్తవం మనస్సుకు దిగ్భ్రమ కలిగించక పోదు. "అట్టి అసాధారణమైన పనిని సాధించాలంటే, ఆ లేఖకులందరు కలిసి బహు సన్నిహితంగా పని చేసి యుండాలి" అని ఎవరైనా చెప్పవచ్చు. వారు అలా కలిసి యుండడానికి వీలులేదని చరిత్ర రుజువు చేస్తుంది. వీరిలో ఎక్కువ మంది ఒకరినొకరు చూచినవారు కారు. వారు శతాబ్దాలచే వేరు చేయబడ్డారు, వారి రచనలను రివైజ్ చేసేలా ప్లాను వేసికొనే అవకాశం కూడా వారికి

లేదు. ఈ పరిపూర్ణమైన ఏకీభావాన్ని వేరొక మార్గంలో వివరించవలసియుంది.

వాస్తవం కాదనడానికి వీలులేదు: ఈ ఏకత్వం భాగాలన్నిటి మధ్యను, లేఖకుల మధ్యను నిలిచియుంది. ఈ రచనల్లో అసంబద్ధాలు కనుగొనాలని చాలామంది ప్రయత్నించి విఫలులయ్యారు. బైబిలు ఒకే గ్రంథం, ఏకం చేయబడిన మొత్తమైయుంది.

ఉదాహరణకు, దాని రెండు ప్రధాన భాగాలు: పాత నిబంధన, క్రొత్త నిబంధనలనే వాటిని ఆలోచించు. అవి రెండు వేరైన నిబంధనలకు (లేక ఒడంబడికలకు) రెండు రకాలైన జనులకు ప్రాతినిధ్యం యిచ్చినా, అవి రెండును బహు రమ్యంగా బంధింపబడి యున్నాయి. "పాత నిబంధన అనేది దాచబడిన క్రొత్త నిబంధన అనియు, క్రొత్త నిబంధన అనేది బయలుపరచబడిన పాత నిబంధన అనియు" ఒకతను అన్నాడు. పాత నిబంధన వేర్లును, క్రొత్త నిబంధన ఫలమునై ఉన్నాయి.

బైబిల్లోని మొదటి పుస్తకానికిని కడపటి పుస్తకానికిని మధ్యగల కొన్ని తారతమ్యాలను గుర్తించుదాం.

(1) ఆదికాండం భూమ్యాకాశాల సృష్టితో ఆరంభమవుతుంది; ప్రకటన క్రొత్త ఆకాశములు, క్రొత్త భూమిని సృజించడంతో అంతమౌతుంది.

(2) ఆదికాండం వెలుగు కలగడం, మరియు సూర్య చంద్రులు సృజింపబడడాన్ని గూర్చి చెప్పుతోంది. ప్రకటనయైతే, మానవునికి వాటివలన కలిగిన సేవ అంతమౌతుందని తెలుపుతోంది – ఎందుకంటే, క్రొత్త పట్టణం (పరలోకం)లో దేవుడును, గొర్రెపిల్లయు (యేసును) వెలుగైయుంటారు.

(3) ఆదికాండంలో, నరుడు సాతానును కలిసికొని పరాజితుడౌతాడు. ప్రకటనలో, మరొక యుద్ధం జరిగింది; ఈ సారి అపవాది ఓటమిని రుచి చూస్తాడు, ప్రభువైన యేసు ద్వారా నరుడు జయశాలియౌతాడు.

(4) ఆదికాండంలో, తొలి స్త్రీ పురుషులు నివసించిన ఏదెను తోటలోనుండి నరుడు వెళ్లగొట్టబడ్డాడు; ప్రకటనలో, అతడు దేవునితో పూర్వ స్థితిలో తిరిగి పెట్టబడ్డాడు.

(5) చివరిగా, పాపము అమరత్వాన్ని అనుభవించకుండునట్లు – జీవవృక్ష ఫలాలను భుజించే భాగ్యాన్ని నరుడు ఎలా పోగొట్టుకొన్నాడో ఆదికాండం తెలుపుతోంది. ప్రకటనలో, పాపము లయపరచబడినదైనందున, జీవవృక్ష ఫలములను తిని నరుడు నిరంతరం జీవించేలా ఆహ్వానించబడ్డాడు!

అవును, గ్రంథము యొక్క ఏకత్వము నిజంగా ఆశ్చర్యమైనదైయుంది. ఈ ఏకత్వం వైపు మనం తేరిచూచినప్పుడు, దిగ్భ్రమముతో నిలిచి, దేవుడే దానికి గ్రంథకర్తయై ఉండాలనే తీర్మానానికి వస్తాం.

## దాని చర్చనీయాంశము

బైబిలులోని విషయాల కూర్పు దైవ పర్యవేక్షణతో జరిగియుంటేనే బైబిలు ఏకత్వం సాధించింది. ఈ సాహిత్య కార్యక్రమము జరిగిన పదహారు శతాబ్దాలు జీవించే అవకాశము ఏ మానవ లేఖకునికి లేనందున, దేవుడు మాత్రమే (బైబిలు) గ్రంథానికి కర్తయైయున్నాడని సరిగా చెప్పవచ్చు. “మనుష్యులు పరిశుద్ధాత్మవలన ప్రేరేపింపబడినవారై దేవుని మూలముగ పలికిరి” అని పేతురు చెప్పినప్పుడు అతని మనస్సులో ఉన్నది యిదే కాబోలు (2 పేతురు 1:21బి).

మరియు సమస్తము ఏకంగా సమకూర్చబడేలా ఏకత్వం కలిగియుండడానికి, ఒకే గ్రంథకర్త అవసరమైయుండడం మాత్రమేకాదు, ఒకే చర్చనీయాంశము కూడా కావలసియుంటుంది. ఈ గ్రంథం యొక్క చర్చనీయాంశమేమి? “మానవాళి” దాని చర్చనీయాంశానికి కారణమైయున్నా, “మానవాళి యొక్క కథ” దాని చర్చనీయాంశము కాదు, చర్చనీయాంశపు పనిలో యూదులు ప్రధానంగా కన్పించినా, “యూదుల కథ” అనేది బైబిలు చర్చనీయాంశం కాదు. ఆ గ్రంథము యొక్క ఘనమైన చర్చనీయాంశము “నరుని కథ,” ఒకే నరుడు–యేసుక్రీస్తు.

రాబోయే వాని చుట్టు బైబిలు తిరుగుతుందని సరిగానే చెప్పబడింది. పాత నిబంధన సందేశం “ఆయన వస్తున్నాడు” అని, సువార్తల సందేశం “ఆయన యిక్కడ ఉన్నాడు” అని, మిగిలిన క్రొత్త నిబంధన రచనల సందేశం “ఆయన మరల రానైయున్నాడని.”

ప్రభువైన యేసును అది ఎలా బయలుపరచుతుంది అనే దృష్టితో బైబిల్లో ఉన్న ప్రతి పుస్తకం మీద శ్రద్ధకలిగించే పఠనాన్ని జరిగించవచ్చు. “ఆదికాండములో యేసు,” “నిర్గమకాండములో యేసు,” “లేవీయకాండములో యేసు” అంటూ పుస్తకాలు వ్రాస్తూనే ఉండవచ్చు. ఉదాహరణకు:

ఆదికాండం 1లో యేసు, ఎందుకంటే, “సమస్తమును ఆయన మూలముగ కలిగెను” (యోహాను 1:3ఎ).

ఆదికాండం 3లో యేసు, ఎందుకంటే, “తరువాత ఆయన” ఆమె (స్త్రీ) సంతానమై యుండి అపవాది తలను చితుక ద్రొక్కుతాడు (ఆది. 3:15; గలతీ. 3:16).

ఆదికాండం 4లో యేసు, హేబెలు బలి యిచ్చిన గొర్రెపిల్లయందలి ఛాయలో ఆయన దాగియున్నాడు (హెబ్రీ. 12:24 చూడు).

ఆదికాండం 6లో యేసు, ఎందుకంటే, ఆయనయందును ఆయన ద్వారాను కలుగబోవు రక్షణకు ఓడ ఒక గురుతుగా లేక మాదిరిగా ఉంది. ఇంకా యింకా అలా వెళ్లుతునే ఉండవచ్చు.

అప్పుడు, ఈ చర్చనీయాంశమే, యేసు క్రీస్తు అనే మాటకు దాని ఆశ్చర్యకరమైన ఏకత్వాన్ని యిస్తుంది. యేసు – రావలసిన విమోచకుడు, వచ్చియున్న రక్షకుడు, మరలా వచ్చే ప్రభువు ఆయనే అనే అంశము అరవైయ్యారు పుస్తకాల్లో ఉండి ఏకమైయున్న డాక్యుమెంటుగా బంధిస్తుంది.

## దాని ప్రాబల్యము (లేక ప్రభావము)

భూమిమీదనున్న గ్రంథాలయాల్లో ఉన్న రచనలన్నిటిలో, బైబిలు మహా గొప్ప బలమైన ప్రాబల్యాన్ని మానవాళిపై కనుపరచింది. అది చరిత్ర నడకను మార్చింది, సామ్రాజ్యాలను నిలబెట్టింది, జయశాలులను, రాజులను కూలద్రోసింది. దాని విధులను అనుసరించినవారికి విజయాన్ని, దీవెనలను అది తెచ్చింది, దానికి విరోధంగా పోరాడినవారికి మరణాన్ని నాశానాన్ని కూడా అది ప్రాప్తింపజేసింది. బైబిలుకున్న శక్తులు అనేకములు, పలువిధములు, అయితే, జీవితాలను మార్పు చేసి, నరులను లేవనెత్తడానికే దాని శక్తి పని చేయునట్టు ప్రత్యేకంగా గుర్తించాలి.

కొన్ని సంవత్సరాల క్రిందట, ఒక ద్వీపముల సముదాయంలో అనాగరికులైన ప్రజలు నివసిస్తున్నారు. ఈ మోటైన జనులు వస్త్రహీనులుగనే యుద్ధానికి వెళ్లి, తాము సంహరించిన శత్రువుల రక్తాన్ని ఖాళీ పుర్రెలతో త్రాగుతూ, తమ యుద్ధ విజయాన్ని కొనియాడుతూ ఉండేవారని జూలియస్ సీజర్ సైన్యపు రికార్డులో చెరగని చిత్రాలున్నాయి. డ్రూయిడ్స్ బలిపీఠాలవద్ద నరబలులు సహజమేనట. అప్పుడు ఒకటి జరిగింది. ఈ అడవి జాతుల మధ్యకు మిషినెరీలు సువార్తను కొనిపోవడానికి తెగించారు, స్థానికులు అంగీకరించారు. కాలం గడిచింది మహా అలెగ్జాండరు సామ్రాజ్యంకంటే మిన్నయైన దానికి వారు ఏలికలయ్యారు. ఎలాగంటే, ఈ దీవులు బ్రిటిష్ దీవులే!

బైబిలు ఎక్కడికి వెళ్లిందో అక్కడ మానవ జాతి మేలుకరంగా దిద్దబడింది. మారిన జీవితపు వాస్తవాలతో బైబిలే నింపబడియుంది. అన్యాయస్థుడైన సుంకరి యథార్థ వర్తనుడు, నీతిపరుడును దానధర్మాలు చేసేవాడుగా మారిపోయాడు (లూకా 19:1-9). హంతకుడు దూషకుడునైనవాడే గొప్ప అపొస్తలుడుగా రూపొందాడు (అపొ. 7:58; 8:1, 3; 22:4-21). ఇంకా అనేకమైన యితర ఉదాహరణలు కూడా యివ్వబడ్డాయి.

బైబిలు యొక్క శక్తి ద్వారా దేవుడు యితరులకు ఏమి చేశాడో, అలాగే ఆయన మన జీవితాలకు కూడా చేయగలడు. నీవు ఆయన వాక్యము చదివి దాని ప్రకారం

జీవించువాడవైతివా, ఆయన తన కుమారుడైన యేసుక్రీస్తు యొక్క సారూప్యంలోనికి నిన్ను మార్చగలడు.

## దాని ఆదరణ

మానవునికి సేవ చేసే ఇతర రంగాలలోవలెనే, ఆదరణ ననుగ్రహించుటలో బైబిలు ఏకైకమైనది, అసాధారణమైనది, సాటిలేనిది (అసమానమైనది)! సమాధి తరువాత నమ్మదగిన వెలుగును నరుడు చూడగలగడానికి సామర్థ్యాన్ని కలిగించేది బైబిలుకు ముందు ఏదీలేదు, యిక ఎన్నడును ఉండబోదు. పాఠకుని సొంత నిత్యత్వానికి నిరీక్షణను, అభయాన్ని ప్రసాదిస్తాయి. ప్రియుడు మరణించి దూరమైనప్పుడు అవి హృదయానికి నెమ్మదిని చేకూరుస్తాయి.

మరణమనేది ఒక శత్రువు. మనుష్యుని కల్పనా రచన, తత్వదృష్టి ఆ తీవ్రమైన, గంభీరమైన వాస్తవాన్ని ఎప్పటికీ మార్చజాలదు. క్రైస్తవునికి మరణం ఒక శత్రువైనా, దాని పరాజయము ముందుగానే సూచింపబడింది. క్రీస్తు ప్రభువు యొక్క శక్తినిబట్టి, విమోచింపబడిన వానిని ప్రభువు సన్నిధానానికి కొనిపోయే ఒక బలముగా అది పనిచేస్తుంది. ఏదియెలాగున్నా, అది మాత్రం శత్రువుగానే నిలిచి యుంటుంది! మరణమనే శత్రువు రాజ భవనాలలోనికిని, గుడిసెలలోనికిని ఏకరీతిగా ప్రవేశిస్తుంది. అది భర్తను తన భార్యనుండి వేరుచేస్తుంది. చంటిబిడ్డను తన తల్లి చేతుల్లోనుండి విడదీస్తుంది. తీయ్యని సంతోషాన్ని చీకటి నిరాశగా అది మార్చుతోంది.

ప్రేమించిన ఒకడు చనిపోయినప్పుడు, "మమ్ములను ఆదరించే కొన్ని మాటలు మాకు చెప్పండి" అని జనులు అడుగుతారు. ఈ మాటలు ఎక్కడనుండి వస్తాయి? కవి యొద్దనుండియా? లేక ఒక తత్వశాస్త్రవేత్తనుండియా? నీ గొప్ప గ్రంథాలనన్నిటిని వెదకు, మరణం మీ యింటిని తాకినప్పుడు స్థిరంగా నిలిచే ఆదరణ, నిరీక్షణ అనేవి మర్త్యులు వ్రాసిన వాటిలో ఎక్కడా కన్పించవు. బలము, ఆదరణ నీకు అనుగ్రహించే ఒకే మూలము: బైబిలు. దేవుని గ్రంథంలోనుండి నీవు ఈ క్రింది వాటిని చదువవచ్చు:

> గాఢాంధకారపు లోయలో నేను సంచరించినను ఏ అపాయమునకు భయపడను నీవు నాకు తోడై యుందువు నీ దుడ్డుకఱ్ఱయు నీ దండమును నన్ను ఆదరించును (కీర్తన. 23:4).

> ఇప్పుడైతే నిద్రించినవారిలో ప్రథమ ఫలముగా క్రీస్తు మృతులలోనుండి

లేపబడియున్నాడు.

...క్షయమైన యీ శరీరము అక్షయతను ధరించుకొనవలసి యున్నది; మర్త్యమైన యీ శరీరము అమర్త్యతను ధరించుకొనవలసియున్నది. ఈ క్షయమైనది అక్షయతను ధరించుకొనినప్పుడు, ఈ మర్త్యమైనది అమర్త్యతను ధరించుకొనినప్పుడు, –విజయమందు మరణము మ్రింగివేయబడెను (1 కొరింథీ. 15:20–54).

ఆ మీదట సజీవులమై నిలిచియుండు మనము వారితో కూడ ఏకముగా ప్రభువును ఎదుర్కొనుటకు ఆకాశమండలమునకు మేఘములమీద కొనిపోబడుదుము. కాగా మనము సదాకాలము ప్రభువుతో కూడ ఉందుము. కాబట్టి మీరు ఈ మాటలచేత ఒకనినొకడు ఆదరించుకొనుడి (1 థెస్స. 4:17–18).

ఆయన వారి కన్నుల ప్రతి బాష్పబిందువును తుడిచివేయును, మరణము ఇక ఉండదు, దుఃఖమైనను ఏడ్పైనను వేదనయైనను ఇక ఉండదు, మొదటి సంగతులు గతించిపోయెనని సింహాసనములోనుండి వచ్చిన గొప్ప స్వరము చెప్పుట వింటిని (ప్రకటన 21:4).

ఆయా తరములలో, యీ మాటలు – బైబిల్లో యింకా యిలాటివి – కన్నీటిని తుడిచి, నిరీక్షణను యిచ్చి, అక్షరార్థంగా లక్షలాది మందికి ఆదరణను అనుగ్రహించాయి. నిజంగా అది అద్భుతమైన గ్రంథమే.

## ముగింపు

బైబిలు యొక్క ఏడు అద్భుతాలను మనం ఆలోచించాం. అది పాతదే, అయినా నిరంతరం నవీనంగా ఉంటుంది! అది భిన్నమైనది, అయినా పరిపూర్ణమైన ఏకత్వంతో ఉంటుంది. అది ప్రభువైన యేసునందు కేంద్రీకృతమైన ఏకత్వం! తన ప్రభావములో అది శక్తివంతమయ్యింది, అయినా ఆదరణలో బహు సున్నితమయ్యింది! బైబిలు దైవ ప్రేరేపితమైన గ్రంథము; అంతకు మించి దానికి సరియైన వివరణ లేనేలేదు.

## పరిశీలనకైన ప్రశ్నలు

(*జవాబులు - 245వ పేజీలో*)

1. 2 తిమోతి 3:16 ఉపయోగించినట్టు, “దేవునిచే ప్రేరేపింపబడిన” అంటే అర్థమేమి?
2. రోమా చక్రవర్తియైన డయోక్లేషియన్ బైబిలును, దాని సందేశమును నిర్మూలించడానికి ప్రయత్నించాడు. అతడు విజయం సాధించాడా?
3. బైబిలు యొక్క ప్రస్తుతాన్వయానికి లేవీ. 13:45 ఎలా చూపుతుంది?
4. బైబిలులోని వ్యత్యాసాలు, అది దేవునినుండి వచ్చిందని ఎలా రుజువు చేస్తాయి?
5. బైబిలు యొక్క చర్చనీయాంశమేమి?
6. భూలోకమందలి గ్రంథాలయాల్లో ఉన్న రచనలన్నిటిలో, అత్యధికమైన ప్రభావాన్ని వినియోగించిన గ్రంథమేది?
7. తన పాఠకులకు బైబిలు ఏ ఆదరణను ప్రసాదిస్తుంది?
8. బైబిలు దైవ ప్రేరేపితమైన దేవుని వాక్యమని నిరూపించే ఏడు అద్భుతములను పేర్కొనుము.